## జడ్పీ సర్వసభ్య సమావేశం రేపటికి వాయిదా

నల్లగొండ, జూన్ 20 : ఈ నెల 21న నిర్వహించాల్సి ఉన్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉన్నందున చైర్‌పర్సన్ ఆమోదం మేరకు జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని శనివారానికి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఆయా శాఖల జిల్లా అధికారులు గమనించి 22న ఉదయం 10:30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## పదోన్నతులు, బదిలీలకు విద్యాశాఖ కసరత్తు

రామగిరి, జూన్ 20 : నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్నది. ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఈఓ భిక్షపతి పర్యవేక్షణలో సీనియారిటీ జాబితాల పరిశీలన, ఇతర అంశాల్లో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఇంకా స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు.. జడ్పీ, మండల పరిషత్‌లో ఎస్‌జీటీల బదిలీలు జరుగాల్సి ఉన్నది. ఈ ప్రక్రియను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసేందుకు విద్యాశాఖ ముందుకు సాగుతున్నట్లు తెలుస్తున్నది.

# 24 గంటల కరెంటుతోనే నల్లగొండ సస్యశ్యామలం



- 4.65లక్షలకు చేరిన విద్యుత్ కనెక్షన్లు
- ఇంటి వద్ద నుంచే కరెంటు మోటర్ల నిర్వహణ
- పొలాలు, తోటల వద్ద రాత్రిళ్ల పడిగాపులకు చెక్
- కేసీఆర్‌తోనే సాధ్యమైందంటున్న రైతులు

## కేసీఆర్ సర్కారులో నాణ్యమైన కరెంటు కోసం రూ.1,100కోట్లు ఖర్చు



నల్లగొండ ప్రతినిధి, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : సమైక్య రాష్ట్రంలో అత్యధిక వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న జిల్లా ఏందంటే అది ఉమ్మడి నల్లగొండ జిల్లానే. కరువు కాటకాల నడుమ భూగర్భ జలాలు అంతంత మాత్రమే ఉన్నా.. రైతులు బోరు, బావులపై ఎక్కువగా ఆధారపడి సాగు చేసేవారు. వ్యవసాయం తప్ప మరో జీవనాధారం లేకపోవడంతో పెద్ద సంఖ్యలో బోర్లు వేస్తూ బావులు తవ్విస్తూ నష్టాలపాలైనా సరే సాగును వదిలేవారు కాదు. ఈ క్రమంలో 2014లో స్వరాష్ట్రం ఏర్పడే నాటికి 2.90లక్షల పైచిలుకు వ్యవసాయ కనెక్షన్లతో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇదే సమయంలో లోఓల్టేజీ, వచ్చిరాని కరెంటుతో ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు మోటర్లు కాలిపోయి ఎక్కువగా నష్టపోయింది కూడా నల్లగొండ రైతాంగమే. దీనికితోడు రాత్రిళ్లు వచ్చిపోయే కరెంటుతో నిద్రలేని రాత్రులతో పాముకాట్లకు, కరెంటు షాక్‌కు గురైన రైతుల్లోనూ నల్లగొండే ముందుండేది. యాసంగిలో వరి, బత్తాయి, నిమ్మతోటలు ఎండడంతో కడుపు మండిన రైతులు కరెంటు సక్రమంగా ఇవ్వాలంటూ రోడ్లెక్కడం సమైక్య పాలనలో నిత్యం కనిపించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పాలనలో అదంతా గతంగా మారింది. కరెంటు సరఫరా పట్ల కేసీఆర్ సర్కార్ చిత్తశుద్ధి, పట్టుదలతో నల్లగొండ జిల్లా వ్యవసాయ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణలోనే నిరంతర ఉచిత విద్యుత్‌తో అత్యధిక లబ్ధి పొందుతున్న జిల్లాగా నల్లగొండ అగ్రస్థానంలో నిలిచింది. ఇదంతా కేసీఆర్ చలువనేని జిల్లా రైతన్నలు ఘంటాపథంగా చెబుతుండడం విశేషం.

ఉద్యమ నేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనాదక్షతతో 2018 జనవరి 1నుంచి మొదలైన నిరంతర ఉచిత విద్యుత్‌తో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికే అత్యధిక మేలు జరిగింది. గత ఏడాది చివరి నాటికే మొత్తం 4.65 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏటికేడు పెరుగుతున్నా కరెంటు సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. నడి వేసవిలో సైతం నిత్యం 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు కొన్నేండ్లుగా విరామమెరుగక సాగులోనే బిజీగా గడిపారు. ఈ వేసవి కంటే ముందు గత ఏడాది చివరి వరకు కరెంటుతో పాటు పుష్కలంగా భూగర్భజలాలు అందుబాటులో ఉండడంతో వేసవిలో సైతం పుచ్చకాయలతోపాటు కూరగాయల సాగు పెద్ద ఎత్తున కొనసాగింది. సమైక్య పాలనలో వరి పంట కోశారంటే మళ్లీ నారుమళ్లు దున్నే వరకు రైతులు ఖాళీగా ఉండేవారు. కేసీఆర్ సర్కార్ హయాంలో ఆ పరిస్థితి లేదు. గతంలో బత్తాయి, నిమ్మ, మామిడి తోటలకే నీళ్లు సరిపడక ట్యాంకర్లతో నీటిని అందించేవారు. కానీ.. కేసీఆర్ పాలనలో నిరంతర కరెంటుకు తోడు నీటి లభ్యతతో పండ్ల తోటల నడుమ సైతం అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తూ వచ్చారు. అందుకు కేసీఆర్ శ్రీకారం చుట్టిన నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరానే కారణం. దీంతో 2023 చివరి నాటికి వ్యవసాయంలో ఎంత కష్టపడితే అంత సంపాదన అన్నట్లుగా రైతులు చెప్పుకొచ్చారు.

### పెరిగిన సాగు విస్తీర్ణం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2014లో వరి సాగు 4.50లక్షల ఎకరాలైతే ఉచిత కరెంటు, సాగునీటి లభ్యతతో 10లక్షల పైచిలుకు ఎకరాలకు పెరిగింది. ఇందులో నాన్ ఆయకట్టు ప్రాంతంలో పెరిగిన సాగు విస్తీర్ణం అధిక భాగం. వరితోపాటు నల్లగొండ జిల్లా బత్తాయి, నిమ్మ తోటలకు ప్రసిద్ధి. 1990 నుంచి విస్తరిస్తూ వచ్చిన బత్తాయి సాగు 2009 నుంచి క్షీణిస్తూ వచ్చింది. సరైన నీటి వసతితోపాటు అరకొర కరెంటుతో తోటలు ఎండిపోయాయి. పది, పదిహేను ఏండ్లు పెంచిన తోటలు కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు పెద్ద ఎత్తున బత్తాయి తోటలను తొలగిస్తూ వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి బత్తాయి, నిమ్మ తోటలపై రైతులు ఆసక్తిని కోల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కానీ.. రాష్ట్రం ఏర్పాటయ్యాక సాగునీటి వసతితోపాటు నిరంతర కరెంటుతో మళ్లీ రైతులు తోటల సాగుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. బత్తాయి, నిమ్మ తోటలకు తోడు మామిడి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, వాటర్ ఆపిల్ సాగుకు శ్రీకారం చుట్టారు. మరోవైపు కూరగాయల సాగు సైతం విస్తృతమైంది. నిరంతర కరెంటుతో వేసవిలో సైతం ఎక్కడ చూసినా కూరగాయల సాగు కనిపించడం మొదలైంది. ఈ ఏడాది వేసవిలో కరువు పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటడంతో పండ్ల తోటలతోపాటు కూరగాయల సాగుపై దెబ్బపడింది. అయితే.. గతేడాది వరకు అందించిన నిరంతర విద్యుత్.. ప్రస్తుతం గ్రామాల్లో కొత్త సాగు పద్ధతులకు కారణంగా మారింది. గ్రామాల్లోని సాధారణ రైతులతోపాటు యువకులు, విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, రిటైర్డ్ ఉద్యోగులు సైతం సాగుబడిలోకి వస్తున్న పరిస్థితులు పెరుగుతున్నాయి. దీనంతటికీ అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధనే కారణమని రైతులు అభిప్రాయపడుతున్నారు. అట్లాంటి కేసీఆర్‌పైన, అప్పటి ఆయన సర్కార్‌పైన కరెంటు సరఫరాలో అక్రమాలంటూ అబాండాలు వేయడం సరికాదంటున్నారు. నిరంతర కరెంటుతో కేసీఆర్ దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ఇమేజ్ సాధించి పెట్టారనడంలో ఎవరికీ సందేహాలు లేవని ప్రజలే పేర్కొంటున్నారు.

### కేసీఆర్ కరెంటు అని పిలిచేటోళ్లం



తెలంగాణ రాష్ట్రం రాకముందు పంటలను కాపాడుకునేందుకు కన్నకష్టాలు పడ్డాం. అప్పట్లో మడి పారిందాక అక్కడే ఉండేటోళ్లం. రాష్ట్రం వచ్చినంక కరెంటు సమస్యలు తీరిపోయాయి. కేసీఆర్ కరెంటు వచ్చిందని సంబురపడ్డాం. పంటలకు దర్జాగా ఎప్పుడంటే అప్పుడు నీళ్లు పెట్టుకున్నాం. ఆ సమస్య పోయిందంటే దానికి కేసీఆరే కారణం. 24 గంటల కరెంటు కేసీఆర్ ఇచ్చినట్లు మరెవ్వరూ ఇవ్వలేదు.

**- రమావత్ రాంకోటి, రైతు, పోల్యానాయక్‌తండా, చందంపేట మండలం**

### పదేండ్లు కరెంటు కోతలు లేవు



తెలంగాణ రాష్ట్రం రాకముందు కరెంటు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. లో ఓల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు, స్టార్టర్లు కాలిపోయేవి. రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. వ్యవసాయానికి, పరిశ్రమల రంగానికి కోతలు లేకుండా కరెంటు ఇచ్చిండ్రు. అది ఓర్వలేక ఇప్పుడు విద్యుత్ కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ కమిషన్ వేయడం, విచారణ జరుగక ముందే నిందలు వేయడం సరైంది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి మోసం చేసింది. వేళాపాల లేని కరెంటు కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ విషయంలో కాంగ్రెస్ గవర్నమెంట్ ఫెయిల్ అయ్యింది.

**- కొండమడుగు నవీన్, మోటర్ మెకానిక్, ముక్తాపూర్, భూదాన్ పోచంపల్లి మండలం**

### కేసీఆర్‌ను బదనాం చేసే కుట్ర



తెలంగాణ రాష్ట్రం రాక ముందు కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. రాష్ట్రం వచ్చినా విద్యుత్ సమస్యలు అలాగే ఉంటాయని చాలా మంది అన్నారు. కానీ.. తొలి సీఎం కేసీఆర్ విద్యుత్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గృహ అవసరాలకు కోతలు లేకుండా కరెంటు సరఫరా చేశారు. వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు ఇచ్చారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 24 గంటలు కరెంటు ఇస్తామని చెప్పి మోసం చేసింది. యాసంగిలో సాగుకు సరిగా కరెంటు ఇయ్యక రైతులు పంటలను ఎండపెట్టుకున్నారు. కేసీఆర్ అప్పుడున్న పరిస్థితుల ప్రకారమే విద్యుత్ రేట్లు చెల్లించారు తప్ప.. ఇందులో ఎలాంటి కుంభకోణం లేదు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను బదనాం చేసే కుట్ర చేస్తున్నది.

**- బొడిగె భరత్ గౌడ్, అమ్మనబోలు, నార్కట్‌పల్లి మండలం**

### కరెంట్ కోతలతో కష్టాలు పడుతున్నాం



నేను చాలా కాలం నుంచి కార్పెంటర్ పనిచేస్తూ జీవనం గడుపుతున్నా. 2014కు ముందు కరెంట్ కష్టాలు అనుభవించాం. 2014 తర్వాత కేసీఆర్ పాలనలో నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వడంతో చేతినిండా పని దొరకడంతో సుఖంగా జీవించాం. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు విధించడంతో పని లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెల్వకుండా ఉండడంతో కార్పెంటర్ వర్క్ చేయలేకపోతున్నాం. నా దగ్గర మరో ఐదుగురు కార్పెంటర్లు పని చేస్తుంటారు. కరెంట్ కోతలతో పని సరిగ్గా నడువక కూలీలకు డబ్బులు ఇవ్వలేకపోతున్నా. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిరంతర కరెంట్ అందించి ఆదుకుంటే.. నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కరెంట్ కోతలతో కష్టాల పాల్జేస్తుండు.

**- కాంబోజు భానుప్రకాశ్, కప్రాయపల్లి, ఆత్మకూర్(ఎం) మండలం**

### 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే



తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదేండ్ల పాటు రైతులకు నిరంతర నాణ్యమైన ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్ సార్‌కే దక్కుతుంది. రైతు పక్షపాతిగా కేంద్రంపై కొట్లాడి సాగర్ నీటితో చెరువులు నింపి మండు వేసవిలో నిండుకుండలా కళకళలాడిన చెరువులు నేడు ఎండిపోయి బోసిపోయాయి. కరెంటు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను శంకించడం సరైనది కాదు. మా సాగర్ నీటిని తరలించినా ఒక్కరూ నోరెత్తలేదు. ఇప్పుడు వానలు లేక, చెరువులో నీళ్లు లేక రైతులు ఆకాశం వైపు కోటి ఆశలతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


***- పొట్ట కిరణ్, గణపవరం, (కోదాడ రూరల్)***

జిల్లాలోని ఒక మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రెండో వివాహం చేసుకొని తన రెండో సంతానానికి వ్యాధి ఉన్నదని చెప్పి ప్రిఫరెన్షియల్‌లో పెట్టడం జరిగింది. దీనిని గుర్తించిన అధికారులు సదరు ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా.. నాకు వద్దని రాతపూర్వకంగా రాసి ఇచ్చారు. కానీ పాయింట్ల కోసం తిరిగి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అఫిడవిట్ ద్వారా పెద్ద మనుషుల తీర్మానాలు చూపించి పాయింట్లు పొందే ప్రయత్నం చేస్తున్నాడు.

మరో ఉపాధ్యాయుడు తన కూతురికి వివాహం చేసి ఇప్పుడు ఆమె తన పైనే ఆధారపడుతుందని, డిపెండెంట్ అని చెప్పి పాయింట్లు పొందడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇతని వ్యవహారాన్ని సైతం గుర్తించిన అధికారులు ఆయనను ఆ కోటా నుంచి తొలగించారు. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. ఇలాంటివి చాలా ఉన్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బదిలీల్లో ఉపాధ్యాయుల అడ్డదారులు

- అక్రమాలకు తెర లేపిన ఉపాధ్యాయులు
- పాయింట్ల కోసం ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఎంచుకున్న వైనం
- వారిని గుర్తించి చెక్ పెట్టిన అధికారులు



సూర్యాపేట, జూన్ 20 : 'ఐపీఎస్, ఐఏఎస్‌లను బదిలీ చేయడం ఈజీ కానీ, ఉపాధ్యాయులను బదిలీ చేయడమే చాలా కష్టం' అంటూ ఇటీవల కొంతమంది ఉపాధ్యాయులు తన సెల్‌ఫోన్ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకుంటున్నారు. ఇది వాస్తవం లాగే కనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు అనగానే అక్రమాలకు తెర లేపుతున్నారు. దొంగదారిన బెస్ట్ ప్లేస్ కోసం వారు చేయని కుప్పిగంతులు లేవు. ఎలాగైనా తాము కోరుకున్న స్కూల్‌లో విధులు నిర్వహించాలని తప్పుడు పత్రాలు సృష్టించి కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే కొంత మంది ఉపాధ్యాయులను గుర్తించిన అధికారులు వారిని తొలగిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు కేసుల్లో పెండింగ్ ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నెల 8 నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగా, ముందుగా పదోన్నతులు చేపట్టారు. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతులు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 108 మందికి పదోన్నతి లభించింది. వీరితోపాటు ఎస్‌జీటీలు, పీఈటీలు, పండిట్లను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే బదిలీలకు వెబ్ ఆప్షన్ ఇవ్వడం జరుగుతుంది.

### బెస్ట్ ప్లేస్ కోసం అక్రమాలకు తెర..

టీచర్ల బదిలీల కోసం అధికారులు వెబ్‌ఆప్షన్ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయుడు తాను పనిచేసే ప్రాంతాన్ని బట్టి అతనికి పాయింట్లు కేటాయించడం జరుగుతుంది. రూరల్ ప్రాంతాల్లో పనిచేసే వారికి సంవత్సరానికి 3 పాయింట్లు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వారికి సంవత్సరానికి 2 చొప్పున పాయింట్లు కలుస్తాయి. సీనియర్ ఉపాధ్యాయులకు సైతం కొంతమేర పాయింట్లు కలువనున్నాయి. వీటికితోడు యూనియన్ లీడర్లు, వివాహం కాని మహిళా ఉపాధ్యాయులు, స్పౌజ్, రేషనలైజేషన్, పీహెచ్‌సీ, ఇతరులు(40 నుంచి 70 శాతం)వికలాంగులు, జాతీయ అవార్డులు, రాష్ట్ర అవార్డులు వచ్చిన వారికి అదనంగా పది పాయింట్లు కలుపనున్నారు. ఎస్ఎస్‌సీ ఫలితాలు, రిసోర్స్‌పర్సన్‌లకు సైతం వారి ప్రావీణ్యాన్ని బట్టి పాయింట్లు కలిపి బదిలీల్లో స్కూళ్లను కేటాయిస్తారు. కానీ, ప్రిఫరెన్షియల్ కేటగిరీకి మాత్రం వీరందరి కన్నా ముందు ప్రియార్టీ ఇవ్వడం జరుగుతుంది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమాలకు తెర లేపారు. లేని జబ్బులను చూపించి బెస్ట్ స్కూల్‌లో పోస్టింగ్ పొందేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారిని ఫోన్‌లో వివరణకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

## ఇక నుంచి మిర్యాలగూడలో సబ్ కలెక్టర్

- హోదా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- దేవరకొండ డివిజన్‌కు కూడా..



మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ కార్యాలయం

మిర్యాలగూడ, జూన్ 20 : పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లకు ఐఏఎస్ క్యాడర్ అధికారులను సబ్ కలెక్టర్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఈ నెల 16న సీఎస్ శాంతికుమారి జీఓ జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రెవెన్యూ డివిజన్లను అప్‌గ్రేడ్ చేయగా.. నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్లను నియమించారు. ఐఏఎస్ క్యాడర్ గల అధికారులను నియమించడంతో సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూన్ 20 : ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ అందేలా జిల్లా అధికారులు కృషి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కా ప్రణాళికతో పారదర్శకంగా పథకాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని సూచించారు. అక్కడ ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, ప్రతి పనిలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ సర్వే వేగంగా చేయాలని, అన్ని కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం తప్పక అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్ లత, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీపీఓ సురేశ్‌కుమార్, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, సీపీఓ కిషన్, డీటీడీఓ శంకర్, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- గంజాయి, జూదం, పీడీఎస్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి
- జిల్లా పోలీస్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూన్ 20 : పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలీస్ అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని, భరోసా కల్పించే విధంగా పని చేయాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సంవర్ధవంతమైన సేవలు అందించాలన్నారు. విసిబుల్ పోలీసింగ్ ద్వారా నేరాలను కట్టడి చేయాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. డయల్ 100పై ఏదైనా సమాచారం వస్తే వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెడుతూ పగలు, రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్బీ డీఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

నల్లగొండ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరు, వారి సమస్యలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల స్థితిగతులు, స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు మరియు సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతికంగా అవగాహన కలిగి ఉండి విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. కేసులను త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. దొంగతనాల కట్టడిపై దృష్టి పెట్టాలని, సాయంత్రం రోడ్లపై విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

## ధరణి దరఖాస్తుల పరిష్కారంలో జాగ్రత్తగా ఉండాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జూన్ 20 : ధరణి దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ధరణి సమస్యలపై కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు, సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ మ్యుటేషన్స్, కోర్టు కేసులు, తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఏ మాడ్యూల్ వచ్చినప్పుడు ఏ అంశాలను పరిశీలన చేయాలనే విషయాలతో రిమార్క్స్, తప్పులు లేకుండా రాయాలని ఆదేశించారు. సమస్యలు ఎక్కడున్నాయో గుర్తించి చెక్ లిస్ట్‌లో పొందుపరుచాలని సూచించారు. ధరణి సమస్యల పరిష్కారంలో ఏ అనుమానం వచ్చినా తాము అందుబాటులో ఉంటామని చెప్పారు. జాగ్రత్తగా, క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు సత్వరమే పరిష్కారం అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టంగండి ఒకటో యూనిట్ మరమ్మతులను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటరాజారామ్

## ఏఎమ్మార్పీ నుంచి నిరంతరం నీటి సరఫరా జరుగాలి

- జెన్‌కో హైడల్ డైరెక్టర్ వెంకటరాజారామ్

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 20 : ఏఎమ్మార్పీ ప్రాజెక్ట్ నుంచి ఎలాంటి అంతరాయం లేకుండా జిల్లాతో పాటు జంటనగరాలకు నీటి సరఫరా జరుగాలని తెలంగాణ జెన్‌కో హైడల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరాజారామ్ అధికారులను ఆదేశించారు. గురువారం పుట్టంగండి పంపుహౌస్ జీరో పాయింట్ వద్ద కొనసాగుతున్న అత్యవసర మోటర్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎమ్మార్పీ ఒకటో యూనిట్ మోటర్ల మరమ్మతులను వేగవంతం చేయాలని, సాగర్ నీటి మట్టం మరింత తగ్గినా నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైతే మరో ప్రత్యామ్నాయ మోటర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర మోటర్ల ద్వారా పుట్టంగండి మోటర్లకు 510 అడుగుల లెవల్‌కు చేరుకునే నీటిని అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తిపోయాలని సూచించారు. జెన్‌కో, మెట్రో బోర్డు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో నీటిని నిరంతరం తరలించాలన్నారు. ఆయన వెంట జెన్‌కో సీసీ ఉపేందర్, ఎస్ఈలు వెంకటవర్మ, రఘురాం, డీఈలు వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డి, ఏడీలు సత్యనారాయణ, సుధాకర్, సంజీవ రెడ్డి, ఏఈలు ఉన్నారు.